# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## నా అనుభవాలు

## - మాధవపెద్ది సత్యం

## ( 1956 ఏప్రిల్ చిత్రసీమ నుంచీ పునర్ముద్రణ)



**నా అనుభవాలను** రాయటానికి ఉపక్రమించాలంటే నా చిన్ననాటి విషయములు ముందుగా చెప్పుకోవలసిందే. నా చిన్నతనపు రోజుల్లో కాంగ్రెస్ స్వాతంత్ర్య పోరాటం సాగిస్తోంది. ప్రతి యువకుని రక్తం ఉడుకెత్తిపోతోంది. మా నాన్నగారు కాంగ్రెస్ సేవకులు, కావటం వల్ల పాశ్చాత్య విద్యాభ్యాసం పిల్లలకు చేయించలేదు. అందుచేత నేను ఇంగ్లీషు నేర్చుకునే అవకాశం లేకపోయింది. పెద్దవాణ్ణయిన తర్వాత స్వశక్తితోనే ఇంగ్లీషు నేర్చుకున్నాను.

చిన్నతనంలో నాటకాలంటే చాలా సరదాగా ఉండేది దాదాపు ప్రతినాటకమూ చూడటం, అందులోని పద్యాలను పాడుకుంటూ ఉండటం అలవాటైపోయింది. రంగస్థలం మీద నటులేవిధంగా నటించారో, ఏవిధంగా పాడారో అదే విధంగా యింటిదగ్గరచేసే వాణ్ణి. ఈ అలవాటువల్లనే యిప్పుడు ఏ ఆర్టిస్టుకు ప్లేబ్యాక్ పాడాలన్నా ఆ నటుని కంఠస్వరానికి తగ్గట్లుగా పాడగలుగుతున్నాను.

నాటకాల విషయంలో మల్లాది సూర్యనారాయణగారితో నేను నాటకాలు ఆడటం మరువలేను. వారితో 'హరిశ్చంద్ర' నాటకంలో విశ్వామిత్రుని పాత్రధరించే వాణ్ణి. మేము నాటకాలాడుతున్న రోజుల్లో, కిరాయికి వెళ్ళినా, చాలా పకడ్బందీగా, సరైన టైముకు నాటకం ప్రారంభించి, తల ఎత్తటంలోగాని, దించటంలోగాని అనవసర కాలయాపన చేయకుండా ఆడేవాళ్ళం. నాటకం రక్తికట్టటానికి యిది ఎంతైనా తోడ్పడుతుంది.

బాపట్ల చేరిన తరవాత కొంతమంది మిత్రుల సహాయంతో దుర్గానాట్యసమితి స్థాపించి, దాదాపు ఒకటిన్నర సంవత్సరం నాటకాలాడాం. తర్వాత మిత్రులు విడిపోవటం., సుందర్రావు సహకారంలో 'ఛలో డిల్లీ' నాటక ప్రదర్శనాలివ్వడం జరిగింది. ఈప్రదర్శనలలోనే 1946 వ సంవత్సరంలో మద్రాసు చేరాను.

ఆ రోజుల్లో డైరెక్టరు వై.విరావుగారు హిందీ తమిళభాషల్లో 'రామదాసు' చిత్రం కలకత్తాలో తీస్తున్నారు. అందులో నేను కబీరు పాత్ర ధరించాను. అప్పుడే కలకత్తాలో ముస్లింల దౌర్జన్యాలు చెలరేగాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కలకత్తానుంచి బయటపడాల్సి వచ్చింది. తర్వాత రావుగారి 'లవంగి'లో కూడా వేషం వేశాను.

అయితే, పాటలు పాడే అవకాశం లభించిన మొదటి చిత్రం 'లైలామజ్ను', తరువాత ఆహుతి, షావుకారు, జీవితం మొదలైన చిత్రాలలో పాడాను. ఇప్పటికి దాదాపు 150 చిత్రాలలో పాటలు పాడాను. వీటిలో తెలుగు, తమిళం, హిందీ, కన్నడం, మళయాళం భాషలు కూడా ఉన్నాయి.

ప్లేబ్యాక్ పాటలు పాడటం చాలా సులభమని కొంతమంది భావం. కాని మేము ఎదుర్కోవలసిన కష్టాలు, చిక్కులు కూడా చాలా ఉంటాయి. నా గాత్రం ఎట్లా ఉన్నా, నేను రంగారావు, రామారావు, రేలంగి మొదలైన మహా నటుల కందరికీ ప్లేబాక్ పాడాను. అయితే వీరిలో ఒక్కొకరి గాత్రం ఒకోరకంగా ఉంటుంది. ఒకరికి మరొకరికి సంబంధం లేదు. అయినా, కేవలం వారు పాడుతున్నట్లుగానే ఉండాలి నేను పాడుతున్నాకూడా. నా శక్తి కొద్దీ నేను ఆ నటులకు న్యాయం చేకూర్చాననే అనుకుంటున్నాను, 'అన్నదాత'లో రంగారావు పాడిన పద్యాలు మొదలు, మొన్నీ మధ్య వాహినీ వారి 'బాగ్యరేఖ' లో రేలంగి పాటవరకూ పాడాను. వీటిలో కొన్ని కేవలం పాటలు పాడటమే కాకుండా, కొన్ని వచనాలు, నవ్వులు కూడా దొర్లుతుంటాయి. అవి ఆ నటులు మాట్లాడుతున్నట్లు నవ్వుతున్నట్లుగానే ఉండాలి కదా ఇదంతా కష్టమైన పనేగా.

ప్లేబేక్ గాయకులు, నటీనటులవలె షూటింగ్‌కు లైట్లముందు నిలబడనవసరంలేదని, వీరిది సుఖమయ జీవితమేనని అనుకుంటారు మీరు. కాని మా కష్టాలు మాకూ ఉన్నవి. పాటను రిహార్సల్ చేసుకొంటానికి కూడా వ్యవధి యివ్వకుండా, రేపు రికార్డింగ్ అనగా, ఈ రాత్రికి వచ్చిపాట, ట్యూన్ యిచ్చే నిర్మాతలు కూడా ఉన్నారు. రాత్రికి రాత్రి ఆ పాటను సాగదీసి, తెల్లవారేసరికి రికార్డింగ్‌కు హాజరుకావాలి. ఇందువల్ల పాట బాగా ఉంటుందనే నమ్మకంలేదు. మాకు తృప్తికరంగా ఉండదు. చివరికి మీకూ తృప్తిగా ఉండదు. పోనీ యింత శ్రమపడ్డా అనుకున్న పైకం వెంటనే అందుతుందా అంటే అదీ ఉండదు. ఈ కష్టాలకు అంతూ ఉండదు.

సినిమా సంగీతం అలవడ్డది కాని శాస్త్రీయ సంగీతం బాగా నేర్చుకోలేదు నేను. ఈ లోపాన్ని తెలుసుకునే ఇది దృష్టిలో పెట్టుకుని సంగీతం నేర్చుకుంటున్నాను. అసలు పాటలకు శాస్త్రీయ సంగీతం అవసరమా అనే సందేహం మీకూ రావచ్చు. పాటకునికి స్వరజ్ఞానముంటే చాలు కాని క్లాసికల్ సంగీతం కూడా వచ్చిన వారికి సినిమా సంగీతం చాలా సులభం. క్లాసికల్ మ్యూజిక్‌లో కూడా అందం లేకపోలేదు. మన చిత్రాల్లో సరైన సన్నివేశాల్లో క్లాసికల్ సంగీతం జొప్పించితే బాగుంటుంది కూడా.

తీరిక ఉన్నప్పుడల్లా మన ప్రాంతల పాట కచేరీలకు వెళ్తూనే ఉన్నాను. ఆ మధ్య పి.లీలతోపాటు హైదరాబాద్ వెళ్ళాను. ప్రేక్షకులు సినిమా పాటలు పాడమని వేధించేవారు. నేను పాడిన పాటలైతే పాడగలనుకాని, ఎవరో పాడిన పాటలు కూడా నేనే పాడానని భావించి ప్రేక్షకులు నన్ను పాడమంటే చాలా చిక్కుల్లో పడేవాణ్ణి. వారికొక నమస్కార బాణంతో యదార్థం చెప్పి బయట పడేసరికి, ప్రాణం పోయినంత పనయేది.

Post your comments